
మహబూబ్‌నగర్‌లో రవీంద్రనగర్ గణేశ్ విగ్రహం వద్ద పూజలు చేసిన మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ కుమార్‌గౌడ్ తదితరులు


రాజాపూర్ మండలంలో నందిగామలో నిమజ్జనానికి తరలుతున్న గణపయ్య


నవాబుపేటలోని ఏకలవ్య యువజనం సంఘం ఏర్పాటు చేసిన మండపంలో భక్తులు

వక్రతుండాయ వందనం


దేవరకద్రలో విఘ్నేశ్వరుడి దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ/జడ్చర్లటౌన్/రాజాపూర్/అడ్డాకులు/మహమ్మదాబాద్/నవాబుపేట/దేవరకద్ర/భూత్పూర్:జిల్లావ్యాప్తంగా గణపతి నవరాత్రోత్సవాలు అంగరంగవైభవంగా జరుగుతున్నాయి. పార్వతీతనయుడిని భక్తిశ్రద్ధలతో కొలుస్తున్నారు. కొన్ని గ్రామాల్లో నిమజ్జనం చేశారు. జిల్లా కేంద్రంలోని నగర పరిధిలోని వెంకటరమణకాలనీ, శేషాద్రినగర్, ఆదిత్యనగర్, నాగిరెడ్డికాలనీ, మైత్రీ నగర్, హ్యాపీ హోమ్స్, రాంమందిర్ చౌరస్తా, రవీంద్రనగర్, దేవునిగుట్టలోని జర్నలిస్ట్‌కాలనీ, అక్షరకాలనీలలో నెలకొల్పిన వినాయక మండపాలలో ఆదివారం మున్సిపల్ మాజీ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ ప్రత్యేక పూజలు చేశారు.

❖ రాజాపూర్ మండలంలో రాయపల్లి, కుచ్చర్‌కల్, తిర్మలాపూర్, చొక్కంపేట్ ప్రత్యేక పూజలు చేశారు. నందిగామలో హనుమాన్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడిని నిమజ్జనం చేశారు. అడ్డాకుల, మూసాపేట, మహమ్మదాబాద్‌లోని పలు గ్రామాల్లో శోభాయాత్రలు నిర్వహించారు.

❖ భూత్పూర్ పురపాలిక పరిధిలోని అమిస్తాపూర్‌లో పలు మండపాల్లో బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ డోకూర్ పవన్ కుమార్‌రెడ్డి గణనాథులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవరకద్ర కన్యకాపరమేశ్వరి ఆలయంతో పాటు బల్సుపల్లి, గోప్లాపూర్, చిన్నరాజమూర్, నాగారం, కోయిల్‌సాగర్‌లో ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని గోపన్ పల్లిలో అన్నదానం నిర్వహించారు.


మూసాపేటలో వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు

లడ్డు వేలం రూ.3 లక్షలు

జడ్చర్ల వెంకటేశ్వరకాలనీలో గణపతి లడ్డును అశోక్‌రెడ్డి రూ.3.01 లక్షలకు, కలశాన్ని శివకుమార్‌గౌడ్ రూ.51వేల, హుండీని పాండు రూ.31వేల దక్కించుకున్నారు.

108 రకాల నైవేద్యాలు

జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో జూనియర్ కళాశాల సమీపంలో ఆకుతోట గోవర్ధన్ రాజేశ్వరి దంపతులు ఆదివారం వినాయకుడికి 108 రకాల నైవేద్యాలు సమర్పించారు.




అమిస్తాపూర్ గణనాథుడికి ప్రత్యేక పూజలు చేసిన బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ దోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి


జిల్లాకేంద్రంలోని హనుమాన్ నగర్‌లో పూజలు చేస్తున్న ఏకదంత యువజన సంఘం సభ్యులు

యూరియా గోస.. ఈ కష్టాలు తీరేదెన్నడో?



చిన్నచింతకుంట మండలకేంద్రంలోని ఆగ్రో రైతు సేవా కేంద్రం-2 వద్ద ఆదివారం యూరియా కోసం రైతులు పడిగాపులు కాశారు. కేంద్రానికి యూరియా వస్తుందన్న సమాచారం తెలుసుకున్న రైతులు ఉదయం 6 గంటలకే కేంద్రం వద్దకు చేరుకున్నారు. 11 గంటలకు మండల వ్యవసాయ అధికారి రాజేష్‌ఖన్నా, ఏఎస్‌ఐ లక్ష్మణ్ కేంద్రం వద్దకు చేరుకొని రైతుల నుంచి ఆధార్ కార్డులను తీసుకున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు 300 బస్తాల యూరియా రావడంతో ఒక్కో రైతుకు రెండు యూరియ బస్తాలను అందించారు.

- చిన్నచింతకుంట

చాకలి ఐలమ్మను తెలంగాణ తల్లిగా ప్రకటించాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): చాకలి ఐలమ్మను తెలంగాణ తల్లిగా ప్రకటించాలని తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి జిల్లా అధ్యక్షుడు కేతూరి శివన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని ధర్మాపూర్‌లో పండుగ సాయన్న చౌరస్తాలో ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి కోసం భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం దొరలకు వ్యతిరేకంగా పోరాడిన వీర వనిత అని అన్నారు. అలాంటి తల్లిని తెలంగాణ తల్లిగా ప్రకటించాలని కోరారు. ఆమె స్ఫూర్తిని కొనసాగిస్తూ ఆమె ఆశయాలను ముందు తరాలకు తెలియజేయడం కోసం విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పండుగసాయన్న సేవా సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ ముదిరాజ్, మాజీ ఎంపీటీసీ రవీందర్‌రెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాజు, నాయకులు నాగరాజు, చంద్రమౌళి, సతీష్, యాదేశ్, మైబు, రమేష్, శ్రీనివాస్, రాంపూర్ యదయ్య, ఆంజనేయులు, రాఘవేంద్ర, చంద్రుడు, విజయ్‌గౌడ్, ఆలూరి ఆంజనేయులు, పోలీస్‌కుమార్, మల్లేష్; బుచ్చన్న, బోలయాదయ్య, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.


చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ చేస్తున్న నాయకులు

కూలీలకు ఆత్మీయ భరోసా రూ.12,500 ఇవ్వాలి

జడ్చర్ల టౌన్: వ్యవసాయ కూలీలకు ప్రభుత్వం ఆత్మీయ భరోసా కింద రూ.12,500 ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు ఏ.రాములు డిమాండ్ చేశారు. ఆదివారం వ్యవసాయ మార్కెట్ ఆవరణలో నిర్వహించిన మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా వ్యవసాయ కూలీలకు ఆత్మీ భరోసా పథకం అమలు చేయటంలో విఫలమైందని విమర్శించారు. అర్హులైన ప్రతి వ్యవసాయ కూలీకి వెంటనే రూ.12,500 ఇవ్వాలన్నారు. గ్రామాల్లో పనులు లేక అడ్డా కూలీలుగా పనిచేస్తున్న వారికి తగు రక్షణ కల్పించాలని, మహిళలకు పురుషులతో సమానంగా కూలి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్, కార్యదర్శి కడియాల మోహన్ పాల్గొన్నారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడిగా నవీన్, కార్యదర్శి ఈర్లపల్లి యాదయ్యతో పాటు 18 మందితో నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఏ.రాములు

క్లుప్తంగా

నేడు కలెక్టరేట్‌లో అన్నదాన కార్యక్రమం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): కలెక్టరేట్ ఆవరణలో నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద సోమవారం అన్నదాన కార్యక్రమా న్ని నిర్వహిస్తున్నట్లు నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నరేందర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అ న్నదాన కార్యక్రమాన్ని కలెక్టర్ విజయేందిర ప్రారంభిస్తారని, అడిషనల్ కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, ఏనుగు నర్సింహారెడ్డి హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని అన్ని శాఖ జిల్లా అధికారులు, ఉద్యోగులు, ప్రజావాణికి వచ్చే ఫిర్యాదుదారులు హాజరుకావాలని కోరారు.

మైసమ్మ చెంత భక్తుల జన జాతర



నవాబుపేట: మైసమ్మ చెంత జన జాతర కొనసాగింది. ఆదివారం అమ్మవారి చెంత పెద్ద ఎత్తున పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మండల పరిధిలోని కాకర్లపహాడ్ పంచాయతీ పరిధిలో గల పర్వతాపూర్ మైసమ్మ దేవాలయానికి ఆదివారం వేలాది జనం తరలివచ్చారు. అమ్మవారికి ఇష్టమైన బోనం మొక్కులు చెల్లించేందుకు జనం తరలివచ్చారు. దీంతో అడవి మొత్తం అమ్మవారి నామస్మరణతో మార్మోగింది.

దివ్యాంగుడికి చేయూత



హన్వాడ: మండల పరిధిలోని నాగినోనిపల్లికి చెందిన దివ్యాంగుడు మహేష్‌బాబుకు బీజేపీ నాయకులు బాసటగా నిలిచారు. ఎంపీ డీకే అరుణ సహకారంతో వీల్‌చైర్ అందజేశారు. పింఛన్ మంజూరు చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఈసందర్భంగా దివ్యాంగుడు మహేష్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రఘురాంగౌడ్, శ్రీధర్, కృష్ణ, రవి కుమార్, విశాల్, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

రజకుల సమస్యలు పరిష్కరించాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రజకులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రజకుల సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గేష్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక వెంకటేశ్వర కాలనీ గుడి ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మా ట్లాడుతూ తమ సంఘం నాలుగేళ్లుగా ప్రతి నెల చి వరి ఆదివారం సమావేశం నిర్వహించుకోనున్నట్లు తెలిపారు. తమ సంఘానికి కమ్యూనిటీ హాల్ నిర్మించుకోవడానికి స్థలం ఇవ్వాలని కోరారు. రజక సామాజిక వర్గ ప్రయోజనాల కోసం స్థానిక ఎమ్మెల్యేను కలుస్తామని తెలిపారు. కార్యక్రమంలో నా యకులు ఎల్లంగారి భరత్‌కుమార్, నరసింహ్మా, మల్లేష్, పాండు, మహేష్, సాయిలు, రవి, వెంకట య్య, వెంకటేష్, కిషోర్, గంగన్న, రమేష్, కృష్ణ, శ్రీ ను, సత్యానారాయణ, సత్తయ్య, రాములు, కాశన్న బాబు రావు బాలస్వామి, మనోహర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో సేవాదళ్‌కు ప్రత్యేక స్థానం


సేవాదళ్ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: కాంగ్రెస్ పార్టీలో సేవాదళ్ విభాగానికి ప్రత్యేక స్థానం ఉందని రాష్ట్ర సేవాదళ్ విభాగం సలహాదారులు సుభాష్‌ఖత్రి అన్నారు. చివరి ఆదివారం సందర్భంగా పట్టణంలోని రాజీవ్ గృహకల్పలో సుభాష్‌ఖత్రి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గజగౌని శ్రీనివాస్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై జెండాను ఎగురవేశారు. సుభాష్‌ఖత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో సేవాదళ్‌కు ఘనమైన చరిత్ర ఉందని అన్నారు. పార్టీ కార్యక్రమాలతో సేవా కార్యక్రమాల్లో సేవాదళ్ విభాగం ముందుండి పనిచేస్తుందన్నారు. జిల్లాలో సేవాదళ్‌ను మరింతగా బలోపేతం చేయాలని కోరారు. ప్రతి నెల చివరి ఆదివారం సేవాదళ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సేవాదళ్ నాయకులు రాంచందర్, ఎండి.షరీఫ్, ప్రభాకర్, ఆబిద్, రవి, ఖాసీం, శ్రీను, పరమేష్, జగదీష్, అలీ, వేణుకుమార్, అశోక్, వెంకటలక్ష్మి, యూసుఫ్, శ్రీరాములు, లోక్‌నాథ్, దేవన్న, నారాయణ, మహ్మద్ ఖాదర్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

దేవరకద్ర రూరల్: ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ నాగన్న సూచించారు. పోలీస్‌శాఖ అధ్వర్యంలో ఆదివారం కొకుంట్లలోని ప్రజలకు ఆన్‌లైన్ మోసాలు, మూఢనమ్మకాలు, రోడ్డు భద్రత నియమాల గురించి అవగాహన కల్పించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ సామాజిక రుగ్మతలను నిర్మూలించి శాస్త్రీయ దృక్పథంతో కూడిన అవగాహన కలిగ్పించేందుకు యువత ముందుకు రావాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలంతా సహకరించాలని కోరారు. సైబర్ నేరాలు జరుగుతున్న విధానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం కొకుంట్లలో ఏర్పాటు చేసిన వినాయక మంటపాలను పరిశీలించి, నిర్వాహకులకు భద్రత పరమైన సూచనలు చేశారు.


పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి మద్దతివ్వాలి


సమావేశంలో పాల్గొన్న ప్రజా సంఘాల నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఉపరాష్ట్రపతిగా పోటీ చేస్తున్న జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి జిల్లా ఎంపీలు పార్టీలకతీతంగా ఓట్లు వేయాలని పలువురు ప్రజాసంఘాల, ప్రజాస్వామికవాదులు కోరారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రముఖ విద్యావేత్త కె.లక్ష్మణ్‌గౌడ్, కార్మిక సంఘం నాయకులు ఎస్‌ఎం.ఖలీల్ నిర్వాహకులుగా వ్యవహరించారు. పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి మాట్లాడుతూ దేశంలో మాట్లాడేవారిని ఏదో నెపంతో వేధింపులకు గురిచేయడం బీజేపీ పాలనలో పరిపాటి అయిందన్నారు. ఎంపీలు ప్రజాస్వామికవాది అయిన జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి ఓటు వేయాలని కోరారు. రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ మాట్లాడుతూ ఇండియా కూటమి అభ్యర్థిగా ఉపరాష్ట్రపతి బరిలో ఉన్న జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఆదర్శవంతమైన ప్రజాస్వామిక వాది అని అన్నారు. మహబూబ్‌నగర్‌లో పార్టీలకతీతంగా ప్రజాస్వామ్యవాదులు ఆయనకు సంఘీభావంగా నిలవడం ఆదర్శనీయమని అన్నారు. సమావేశంలో సామాజిక వేత్త హనీఫ్ అహ్మద్, తెలంగాణ విద్యావంతుల వేదిక నాయకులు సతీష్ తదితరులు ప్రసంగించారు. సీపీఐ నాయకులు సురేష్, ప్రజా సంఘాల నాయకులు వామన్‌కుమార్, కేసీ. వెంకటేష్, ఫారుఖ్ హుస్సేన్, శ్రీదేవి, అయూబ్, బాబర్‌షేక్, నూరుల్ హసన్, ఎం.ఎ.రహీం, మోసీన్‌ఖాన్, సమద్‌ఖాన్, రవీందర్‌గౌడ్, రహెమాన్, జలాల్‌పాషా, మజీద్, నిజాముద్దీన్, బాలకృష్ణ, సలీం, మిర్జా బదివుల్లా, గోపాల్, సుభాష్, జనార్దన్, రామ్, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

కుంటను తలపించేలా వర్షం నీళ్లు..!

అడ్డాకుల: మూసాపేట మండలం జానంపేట గ్రామంలో 44వ నంబర్ జాతీయ రహదారి సమీపంలోని 1వ వార్డులో వర్షం నీళ్లు ఇళ్ల ముందు చిన్నపాటి కుంటను తలపిస్తున్నాయి. వార్డులో సుమారు 12 నివాస గృహాల ముందు మురుగు కాల్వను ఏర్పాటు చేయలేదు. దీనివల్ల వర్షం నీళ్లు ఇళ్ల చుట్టూ నిలుస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పెద్ద ఎత్తున నీళ్లు నిలవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 15 ఏళ్ల నుంచి మురుగు కాలువ ఏర్పాటు చేయాలని గ్రామ పంచాయతీ అధికారులు, పాలకులను కోరినా ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవని స్థానికులు వాపోతున్నారు. రోజుల తరబడి ఇళ్ల ముందు నీళ్లు నిలిచి ఉండటంతో దోమలు, ఈగలతో పాటు దుర్వాసనకు వ్యాధులకు గురవుతున్నామని ఆవేదన చెందుతున్నారు. మండల అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని తెలిపారు. కుంటను తలపిస్తున్న నీళ్ల భూమిలోకి ఇంకే వరకు తాము రోజు ఇదే సమస్యతో సతమతమవుతున్నామని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని లేదంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని స్థానికులు పేర్కొంటున్నారు.


జానంపేటలో ఇళ్ల ముందు నిలిచిన వర్షం నీళ్లు

ఇమ్మడి నారాయణ సేవలు మరువలేనివి



స్టేషన్ మహబూబ్‌నగర్: ఏనుగొండ గ్రామ మాజీ సర్పంచ్ ఇమ్మడి నారాయణ చేసిన సేవలు మరువలేనివని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. ఇమ్మడి నారాయణ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం స్థానిక ఏనుగొండలోని ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కొత్వాల్ మాట్లాడుతూ ఏనుగొండ గ్రామ సర్పంచ్‌తోపాటు పలు పదవులు నిర్వహించిన ఇమ్మడి నారాయణ చేసిన నిస్వార్థ సేవలు స్ఫూర్తిదాయకమని అన్నారు. గ్రామాభివృద్ధి కోసం కోసం ఇమ్మడి నారాయణ నిరంతరం శ్రమించేవారని, ప్రజాసేవను జీవిత ధ్యేయంగా మార్చుకున్న మహానీయుడని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఇమ్మడి గంగాధర్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



అడ్డాకుల: మండలంలోని కందూర్‌కి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు, సింగిల్‌విండో డైరెక్టర్ వీబీ రాజు గుండెపోటుకు గురై శనివారం రాత్రి మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని ఆదివారం మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. రాజు మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన అంత్యక్రియల్లో పాల్గొన్నారు. మాజీ జెడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి, విండో అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, వివిధ మండలాలకు చెందిన బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు అంత్యక్రియలకు హాజరయ్యారు. ఇదిలా ఉండగా నక్సలైట్ల కాల్పుల్లో మరణించిన దివంగత ఎంపీపీ కందూర్ నారాయణకు రాజు సోదరుడు కావడంతో గ్రామంలో విషాదం అలుముకుంది.

పీయూ తెలుగు హెచ్‌ఓడీగా మార్క్ పోలోనీస్



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూ తెలుగు డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీగా మార్క్ పోలోనీస్‌ను నియమిస్తూ వీసీ శ్రీనివాస్ ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన కొల్లాపూర్ పీజీ సెంటర్ ప్రిన్సిపాల్‌గా కొనసాగుతున్నారు. ఆయను హెచ్‌ఓడీగా నియమించినందుకు వీసీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రూ.2.30 లక్షల విరాళం

భూత్పూర్: వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా మున్సిపాలిటీలోని 10 వార్డుల్లో షెడ్డుల నిర్మాణం, వినాయక ఉత్సవాలకు రూ.2.30లక్షల విరాళాన్ని పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లిక్కి నవీన్ గౌడ్ ఉత్సవ కమిటీ సభ్యులకు అందజేశారు. ఉత్సవాల ప్రారంభోత్సవం నుంచి ప్రతి నిత్యం ఉదయం, సాయంత్రం వేళ వినాయకుడికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఆదివారం 4వ వార్డులోని గణనాథుడికి ప్రత్యేక పూజలు చేసిన లిక్కి నవీన్ గౌడ్ రూ.10 వేల నగదును ఉత్సవ కమిటీ సభ్యులకు అందజేశారు.

రైతులకు అందుబాటులో యూరియా

జడ్చర్ల: రైతులకు అందుబాటులో యూరియాను సరఫరా చేయాలని ఆదివారం హైదరాబాద్‌లో రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ గోపిని కలిసి విన్నవించినట్లు స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం రైతులకు సరిపడినంతా యూరియాను సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తమకు కమిషనర్ హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. వ్యాపారులు కృత్రి కొరతను సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఏడాదిగా ఉచిత అన్నదానం



నవాబుపేట: సంతకు వచ్చే వారికి ఉచిత భోజనం అందిస్తున్న కార్యక్రమం ఆదివారంతో ఏడాది పూర్తి చేసుకుంది. దాదాపు 30వేల మంది వరకు భోజనం చేసినట్లు నిర్వాహకుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహచారి తెలిపారు. గతేడాది ఇదే నెలలో నవాబుపేట సంతకు వచ్చే వారికి ఉచిత భోజనం అందించే కార్యక్రమం చేపట్టామని, అప్పటి నుంచి నిరంతరంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మండల పరిసరాల్లోని దాదాపు 70 గ్రామాల ప్రజలు సంతకు వస్తారని తెలిపారు. ప్రారంభంలో 350 మంది భోజనం చేసే వారని, ప్రస్తుతం 500 మందికి పైగా ఉచిత భోజనం అందిస్తున్నామని చెప్పారు.

నిమజ్జనం కోసం చెరువు పరిశీలన

జడ్చర్ల/జడ్చర్ల టౌన్: వినాయక నిమజ్జనం కోసం మున్సిపాలిటీ పరిధిలోని నాగసాల చెరువు వద్ద ఏర్పాట్లను సీఐ కమలాకర్, చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత పరిశీలించారు. ఈ ఏడాది కూడా నిమజ్జనం సాఫీగా జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. అలాగే బాదేపల్లిలో ముదిరాజ్ నిమజ్జనోత్సవ కమిటీ ఏర్పాటు చేశాడు. అధ్యక్షుడిగా కావలి నర్సింహా, ప్రధాన కార్యదర్శిగా శివకుమార్..తదితరులను ఎన్నుకున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం పక్కన వేదికను ఏర్పాటు చేసి..నిమజ్జనానికి తరలించే గణనాథులకు స్వాగతం పలుకుతామని ఈ సందర్భంగా వారు తెలిపారు.



ఘనంగా రాధాష్టమి వేడుకలు



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం టీచర్స్ కాలనీలోగల ఇస్కాన్ భక్తి వృక్ష కేంద్రంలో ఆదివారం రాధాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం రాధాకృష్ణ విగ్రహాలకు అభిషేకాలు, చప్పన్‌బోగ నివేదన, మహా మంగళహారతి తదితర కార్యక్రమాలు కొనసాగాయి. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి వేడుకలను తిలకించారు. రాధాకృష్ణుల నామస్మరణ మార్మోగింది. కార్యక్రమంలో ప్రభుజీలు, భక్తులు పాల్గొన్నారు.

ఆరు అడుగుల నాగుపాము పట్టివేత



జడ్చర్ల టౌన్: దేవునిగుట్టతండా వద్ద ఇటుక బట్టీ నిర్వహించే మోత్యనాయక్ కూలీలు నివసించే గుడిసెలో ఆరు అడుగుల నాగుపామును ఆదివారం సర్పరక్షకుడు డా.సదాశివయ్య పట్టుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున కూలీలు నివసించే గుడిసెలోకి పాము వెళ్లినట్లు సదాశివయ్యకు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. దీంతో అక్కడికి చేరుకున్న ఆయన చాకచక్యంతో నాగుపామును పట్టుకున్నాడు. పాము ఆరు అడుగుల పొడవు ఉండగా 10–15 ఏళ్ల వయసు ఉటుందని, ఇంత పెద్ద పాము జనావాసాల్లోకి అరుదుగా వస్తుందని తెలిపారు.

లఘుచిత్రం షూటింగ్ ప్రారంభం



జడ్చర్ల టౌన్: మీనాంబరం పరుషవేదీశ్వర ఆలయంలో ఆదివారం ఎస్‌ఆర్‌ఎఫ్ క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మాత షరీఫ్ నిర్మిస్తున్న మావోడిపెళ్లి షార్ట్ ఫిలిం షూటింగ్ కార్యక్రమాలు ప్రారంభించారు. జహీర్ డైరెక్టర్‌గా వెంకీ రొంపెల్లి, విజయలక్ష్మిలు హీరోహీరోయిన్లుగా నటిస్తున్నారు. షార్ట్ ఫిల్మ్ షూటింగ్‌ను ప్రారంభించిన బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్ మాట్లాడుతూ సోషల్ మీడియా అందుబాటులోకి వచ్చిన తరువాత మధ్యవర్తులను నమ్మి మోసపోకుండా ప్రతిభ ఉన్న యువత లఘు చిత్రాల్లో ప్రతిభ చాటుకోవడం అభినందనీయమన్నారు. గ్రామీణస్థాయి నుంచి కళాకారులు జాతీయస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.